# రచన - ఏప్రిల్, 1994

## రచనా సమీక్ష

"రచన అనేది స్వభావ సిద్ధంగా రావాలిగానీ ఒకరు చెప్తే వచ్చేది కాదు" అన్న విమర్శను ఎదుర్కొనడానికి ముందు మాటతో ప్రారంభించిన ఈ పుస్తకంలో పదకొండు ప్రకరణాలున్నాయి.

హిందీ తరువాత అంతగా పాపులర్ ఫిక్షన్ నవలలు అమ్ముడు పోయేది తెలుగులోనే అయినా అలాంటి రచనలు చేసేవారు అయిదారుగురే ఉన్నారని రచయిత అభిప్రాయం. వారి సంఖ్య పెంచడానికి కంకణం కట్టుకున్న ఈ రచయిత 'రైటర్స్ వర్క్‌షాపు' స్థాపించి ఏడాదయింది. ఇప్పటికిద్దరి సీరియల్సు రెండు పత్రికల్లో వచ్చాయి. మరో యిద్దరివి రానున్నాయి. ముప్పై కథలు ప్రచురితమయ్యాయి. నాలుగు కథలకి పోటీలో బహుమతులు వచ్చాయి. చేయి తిరిగిన రచయితలు వ్రాసే కథలే పత్రికకు సరిపోయేటన్ని వస్తున్నప్పుడు, ఎక్కడో మట్టిలో మాణిక్యాన్ని వెతికి తీసి, మకిలి కడిగి సానబెట్టి ప్రోత్సహించవలసిన అవసరం గానీ, సమయం గానీ, ఓర్పు గానీ ఉన్న ఎడిటర్లు తక్కువని వ్రాశారు. "రచన" పత్రికని సూచనప్రాయంగా మెన్షన్ చేస్తే బాగుండేది.

మొదటి అధ్యాయం "ప్రారంభం"లో కథకి ఎలా పేరు పెట్టాలి, కథని ఎలా ప్రారంభించాలి అన్న విషయాలు క్షుణ్ణంగా చర్చిస్తూ సాధారణంగా కొత్త రచయితలు చేసే పొరపాట్లను సోదాహరణంగా వివరించడం జరిగింది. ఉదాహరణగా యిచ్చిన వివిధ రకాల కథల్లో "శృంగారం" ఒక్కటే భయానకంగా ఉంది. గోపీచంద్ కథ హృద్యంగా ఉంది. మిగతావీ పుస్తక ప్రయోజనానికి ఉపయోగపడుతూనే పాఠకులను రంజింపజేస్తాయి. రెండో అధ్యాయంలో కథాంశాన్ని ఎలా ఎన్నుకుని విస్తరింపజేయాలీ అన్నది సమగ్రంగానూ, సోదాహరణంగానూ చర్చించడం జరిగింది. ఒక ఆలోచన మనలో రూపు దిద్దుకుంటున్నప్పుడు దానికి రంగు, రుచి, వాసన, ఏమీ ఉండవు కాబట్టి రచయితే ఎలా అద్దాలో వివరించబడింది. ఇంతకంటే బాగా చెప్పడం అసాధ్యం. వేరు నిజాన్ని వేరుగా ప్రజెంట్ చేయకపోవడం పాపులర్ నవలా లక్షణమని తెలుస్తూనే - 'మనం వ్రాసేది కేవలం పాఠకుల కోసమే తప్ప విమర్శకుల కోసం కాదు' అంటూ పాపులర్ నవలని నిర్వచించడమూ

**పాపులర్ రచనలు చేయడం ఎలా?**
**యండమూరి వీరేంద్రనాథ్**
180 పేజీలు; వెల: రు. 30/-;
ప్రతులకు: నవ సాహితి బుక్ హౌస్; ఏలూరు రోడ్డు; విజయవాడ - 520 002

జరిగింది. మూడో అధ్యాయంలో పాత్ర పోషణ విషయంలో తన అనుభవాన్ని, అవగాహననూ రచయిత పాఠకులతో పంచుకున్నారు. నాలుగో అధ్యాయంలో నాటకీయత ప్రాధాన్యత వివరించబడింది.

సాధారణంగా చాలా మంది శైలి, శిల్పం అంటే ఏమిటని అడుగుతుంటారు. ఎంతో క్లిష్టమైన ఈ ప్రశ్నల సమాధానం ఈ పుస్తకం అయిదు, ఆరు అధ్యాయాల్లో దొరుకుతుంది. అవి చదివినప్పుడు శైలి, శిల్పం అంటే ఏమిటో ఇంకొకరికి చెప్పలేకపోయినా తమకు తాముగా అర్థం చేసుకుంటారు. ఆ పదాలు అలాంటివి. నిస్సందేహంగా ఈ పుస్తక రచయిత సామర్థ్యానికి అద్దం పట్టేవి అధ్యాయాలు. చదవగానే శరీరం ఆర్ద్రత చెందితే అది సెక్స్, మనసు ఆర్ద్రత చెందితే అది శృంగారం అంటూ తేడా చెప్పగలగడం సామాన్యమైన విషయం కాదు.

రచనలు చేస్తున్నప్పుడు రచయిత పాటించవలసిన బాధ్యతలు, విధులను ఏడో అధ్యాయంలో ఎక్కడా ఒక్క పాయింటు కూడా మిస్సవకుండా చెప్పారు రచయిత. అభిమానుల గురించి ప్రస్తావిస్తూ అభిమానం నీరు లాంటిదనీ, అది చాలా తొందరగా పల్లానికి ప్రవహిస్తుందనీ హెచ్చరించారు. సెక్సు, వయొలెన్స్ లేకపోవడం వల్లనే ఒక రచన మంచి రచన అవదని మేధావులకు చురక వేశారు.

ఎనిమిదో అధ్యాయంలో పత్రిక్కి రచన ఎలా పంపాలో, ఒక నవల పబ్లిషింగులో ఉండే సాధక బాధకాలూ, ఖర్చులూ ఎలా ఉంటాయో వగైరా విశేషాలను అరటి పండు వలిచిచ్చినట్లు చెప్పడం జరిగింది. "ఏ ఎడిటరూ కూడా మంచి కథని వదులుకోడు" అని ఈ రచయిత అభిప్రాయపడ్డారు. బహుశా ఎడిటరుకో, మంచి కథకో మనం నిర్వచనం మార్చుకోవాలి.

ఎంతో చక్కగా వ్రాయబడిన ఈ పుస్తకంలో తొమ్మిదో అధ్యాయం ఒక్కటే అసంతృప్తిని కలిగిస్తుంది. సినిమా రచన గురించి రచయిత ఇచ్చిన వివరాలు సినిమా రచయితలు కావాలనుకున్నవారికి అటు సమగ్రంగానూ, ఇటు ప్రయోజనకరంగానూ కూడా లేవు. నిర్మాత, దర్శకుల సమయం చాలా విలువయిందని (కథ వినడం దృష్ట్యా) చెప్పడంలో - మన నిర్మాత, దర్శకులు మంచి కమర్షియల్స్ తీయడానికి ఇతర భాషలపై ఆధారపడడానికి కారణం తెలుస్తుంది. రాఘవేంద్రరావు తీసిన జ్యోతి, కల్పన, ఆమె కథ చూసినవారాయన దృశ్య కావ్యాలు తీయలేరనలేరు. శారద, జీవనజ్యోతి వంటి హిట్ చిత్రాలు తీసిన విశ్వనాథ్ తీసిన దృశ్య కావ్యం శంకరాభరణం మాత్రమే! అది కమర్షియల్‌గా పెద్ద హిట్ అయింది. ఆ తర్వాత అపరిపక్వదశలోని స్వంత కథలకు రూపకల్పన చేయాలన్న తాపత్రయంలో ఆయన తీసిన సినిమాలను శంకరాభరణం కళ్ళద్దాలతో చూసి దృశ్యకావ్యాలని అంతా అంటున్నారు. నిర్మాత, దర్శకులు తమ కాలాన్ని కథల కోసం ఎక్కువగా వెచ్చించడంలోనే వ్యాపార పరంగానూ ప్రయోజనముందని గ్రహించిన వారే హిట్ చిత్ర నిర్మాణంలో ఎక్కువ కాలం మనగలరు.

'ఉపసంహారం'లో రచయిత అన్నట్లు ఆత్మశోధన ... కొంత వరకూ

## యండమూరి వీరేంద్రనాథ్ పొరపాటు .... ?!?!?!

తెలుగు పత్రికలకి 'ఇన్‌స్టాల్‌మెంట్' పద్ధతిలో నవలలు రాయడం అనే ఒరవడిని ప్రవేశపెట్టిన కొద్ది మంది ప్రముఖ రచయితలలో ఒకరైన వీరేంద్రనాథ్, "ఒకేసారి నవలంతా వ్రాయటం ఎప్పుడూ మంచి పద్ధతి. వీలైనంత వరకూ ఆ పద్ధతిని అనుసరించటం రచయితలకి అభిలషణీయం" అని అనడం విశేషం! తను పూర్తిగా ఆచరణలో పెట్టకపోయినా, ఆచరణలో పెట్టదగినది ఏదన్నది మాటగా చెప్పడంలో చిత్తశుద్ధి, నిజాయితీ ద్యోతకమౌతున్నాయి.

'పాపులర్ రచనలు చేయటం ఎలా?' అని వివరిస్తూనే, ఈ పుస్తకం చదివినవారు "సామాజిక స్పృహ వున్న నవల వ్రాస్తారో, కమర్షియల్ నవల వ్రాస్తారో, అద్భుతమైన నవల వ్రాస్తారో వారిష్టం. 'ఎలా వ్రాయాలి?' అని మాత్రమే చెప్పే పుస్తకం ఇది" అంటారు. ఇందులో నిజాయితీగల రచయితలు ఏ రకమైన నవల రాయాలో గోపీచంద్ గారి రచనను ఉదహరిస్తూ 'చెప్పకనే చెప్పడం' వీరేంద్రనాథ్‌లోని గడుసుదనాన్ని చూపెడుతుంది. పాపులర్ నవల ఎందుకు రాయకూడదో, వాటి దుష్పరిణామాలేమిటో అంతర్లీనంగా చెప్పారు. దీన్ని సరైన అవగాహనతో అందుకున్న వారు మంచి రచయితలుగానూ, అందుకోలేని వారు పాపులర్ రచయితలుగానూ రూపొందడానికి దోహదపడుతుంది రచన.

ఏ నవల రాయడానికి పడవలసిన కష్టాన్నీ, కాలాన్నీ ధనాపేక్ష లేకుండా ఈ రచన చేయడానికి వెచ్చించానని, నలుగురికీ తేరాలన్న తపన తప్ప అమ్మకాలు కావని, అర్థం చేసుకుని (పుస్తకం చదివి, నచ్చితే) సహకరించండన్న వీరేంద్రనాథ్ ఈ మధ్యనే రాసిన 'సక్సెస్‌ఫుల్' నవల 'ప్రేమ' ప్రారంభంలో రాసిన ఈ క్రింది పేరాని 'శైలి' అనే ప్రకరణంలో ఉదాహరణ కోసం వాడారు:

"ఊరు పూజా పీఠంలా వుంది. ఊరు మొదట్లో వేపచెట్టు వేదం చదువుతు న్నట్టు వుంది. ఊరు చుట్టూ మెలిక తిరిగిన పిల్ల కాలువ, అందమైన అమ్మాయి నడుం చుట్టూ తిరిగిన వరికిణీలా వుంది."

పై పేరాలో ఒక పదం తప్పుగా ప్రయోగించడం జరిగింది. కాబోయే రచయితలకు పాఠాలు చెప్పేటప్పుడయినా ఆ తప్పును సవరించుకోవడం జరగలేదు. ఈ విషయం వీరేంద్రనాథ్ దృష్టికి తెచ్చినప్పుడు చాలా మామూలుగా 'అది తప్పే' అని, 'దాన్ని అందరి దృష్టికి తేవడం నయమే' అని అభిప్రాయపడ్డారు.

ఇంతకీ ఆ తప్పేమిటి????

సరైన సమాధానం చెప్పిన పది మంది పాఠకులకి "మంచి రచనలు చేయడం ఎలా?" అని తెలియజెప్పే "పాపులర్ రచనలు చేయటం ఎలా?" అనే పుస్తకాన్ని బహుమతిగా అందజేస్తాము.

సమాధానం పోస్ట్‌కార్డ్ మీద రాసి పంపితే చాలు!

– సంపాదకుడు

ముగింపు తేది: 10.04.'94

సమర్థన ... కొంత ఆత్మ విమర్శ ... నెరపే ఈ పుస్తకం.

ఈ పుస్తకం వ్రాయడంలో నిజాయితీ ఉంది. రచనలు చేయడంలో ఒక స్థాయికి చేరుకున్న వారు – ముందుకు దూసుకుపోవడానికి ఈ పుస్తకం ఎంతగానో సహకరిస్తుంది. అయితే ఒక విషయం మరిచిపోకూడదు. ఇంద్రజాలికుడు సర్కార్ వ్రాసిన పుస్తకం చదివితే ఇంద్రజాలం నేర్చుకునే బదులు – అదింత కష్టమా అన్న విస్మృహ కలుగుతుంది. ఈ పుస్తకం చదవగానే అలాంటి విస్మృహ కలిగిన వారు – ఈ పుస్తకం వల్ల ప్రయోజనం పొందాలనుకుంటే వృథా!

వర్తమాన రచయితలు మరో విషయం కూడా గుర్తుంచుకోవాలి. రచయితే తన రచనకు మొదటి పాఠకుడు. ఆ విధంగా వీరేంద్రనాథ్ అదృష్టవంతుడు. మీరు మీ రచనకు అలాంటి మొదటి పాఠకుడినివ్వగలిగే స్థాయికి చేరుకోవడం అవసరం. అందుకీ పుస్తకం ఎంతైనా సహకరిస్తుంది.

కేవలం పాపులర్ రచనలకే పరిమితం చేసుకోవడం వల్లనేమో గతంలో వచ్చిన 'కథలు వ్రాయడం ఎలా' (ఆరుద్ర) వగైరా పుస్తకాలనిందులో ఉదహరించలేదు. తెనాలి రామకృష్ణుడు గేలి చేసిన "కృష్ణా, రాజకంఠీరవా" పద్యంలా 'దేముడు' అనే పదం తప్పనీ, 'దేవుడు' అని వ్రాయాలని తనకు పాఠక సహేలు వ్రాసే దాకా తెలీలేదని మూడవ పేజీలో అని – 162వ పేజీలో ఏకాగ్రత, సిన్సియారిటీ, జ్ఞాపక శక్తి అన్న హెడ్డింగ్ క్రింద 'దేముడు' అన్న పదం వాడడం 'సెన్సాఫ్ హ్యూమర్' కాదు కదా అనిపిస్తుంది. రచయితల పాపులారిటీ కేవలం కొన్ని పత్రికల దృష్టిని ఆంచనా వేయడం వల్లనేమో – సమకాలీనుల్లో చాలా తక్కువ మందిని ఈ పుస్తక రచయిత గుర్తించడం జరిగింది. పుస్తకం అట్ట వెనుక "పొరపాటున" వంటి పదం లేకుండా జాగ్రత్త తీసుకుంటే బాగుండేది. ఎందుకంటే పుస్తకం లోపల అచ్చు తప్పులు చాలా తక్కువ.

పాపులర్ రచనను అడ్వర్టయిజింగ్, మోడలింగ్ తరహా జీవనోపాధి కళగా అభివర్ణించడానికి సవలలో ప్రయత్నం జరిగింది. పాప్యులరైన వేమన తన ప్రియురాలిని నగ్నంగా చూసేక విరక్తి చెంది యోగి, మహాకవి అయ్యాడంటారు. సాహిత్యంలో తమకంటూ స్థానం సంపాదించుకోవాలనుకునే వారికి ఎప్పుడైనా పాపులర్ రచనల వ్యామోహం కలిగితే – వాటి నగ్న స్వరూపాన్ని పుస్తకం చూపించి సహకరిస్తుంది. పాపులర్ రచయిత ముసుగులో ఉన్న వీరేంద్రనాథ్ రచనలు తను వ్రాసిన పాపులర్ కోవకు చెందవు. శంకరాభరణం పాపులర్ అవడానికి ఉన్నన్ని కారణాలూ ఆతడి రచనల పాపులారిటీకి ఉన్నాయి. తన రచనలకు సాహిత్యంలో స్థానముంటుందనీ, ఉండని ఆతడికీ తెలుసు. ఆ మాట ఇతరులనాలని ఆశించుకోవడంలో తప్పు లేదు. ఆ ఇతరులు మేమే కావడం మాకు సంతోషం.

ఈ పుస్తకం సాధారణ, అసాధారణ రచయితలందరికీ ప్రయోజనకారి. సాహిత్యపు విలువలను కలిగి ఉంది. అందరూ కొని చదివి దాచుకోదగ్గ ఈ చిన్న పుస్తకం వెనుక అవిరళ కృషి ఉన్నప్పటికీ ముప్పై రూపాయల ధర కొంత ఎక్కువేననిపిస్తుంది.

– వసుంధర